


**చం**ద్రం చటుక్కున ఆగాడు! చుట్టూ కనుచూపుమేర, వెన్ను వేసిన వరిచేను కన్నుల పండువుగా ఉన్నది! అతని మనస్సు ఆనందంతో పొంగిపోయింది. మూడు సంవత్సరాల క్రిందట చంద్రం తునికిచెరువు గ్రామానికి వలస వచ్చాడు! ఇప్పుడు వరిచేనుగా ఉన్న భూమి బీడుపడి, చెట్లతో గీజరు మంటూఉన్నది! చెట్లన్నీ నరికించి, మోళ్ళు తీయించి, మళ్ళు కట్టించాడు. చెరువుకు పడిన గండి పూడ్పించాడు!

......తొలకరి వానలకే చెరువు నిండింది!

---


సి. శ్రీ రా మ మూ ర్తి

*అది పులి. అసలే క్రూరమృగం. పైగా పిల్లల తల్లి. ఇంక చెప్పాలా? అయినా కంటబడిన దుప్పిపిల్లను చంపక విడిచింది. ఆలోచనాశక్తి కలిగి ఉండి, సృష్టిలో కెల్లా ఉత్కృష్టమైన ప్రాణిగా పరిగణింపబడే మానవుడు చేజిక్కిన హరిణం పట్ల అంతటి ఔదార్యం చూపగలుగుతున్నాడా?*

# ఔదార్యము

సకాలంలో నారుపోసి. దమ్ము బాగాచేసి, ఊడ్పించాడు. అంచెలు అంచెలుగా మూడే ళ్ళలో అతని పొలమంతా ఊడ్పు పడింది. ఏపుగా పెరిగిన వరి మొక్కల్ని పరికిస్తూ చంద్రం ముందుకు నడుస్తున్నాడు.

తాను దండకారణ్యానికి వస్తానని, వ్యవసాయం చేస్తానని చంద్రం కలలో కూడా ఊహించ లేదు! కానీ ఒకనాటి సంఘటన అతన్ని ప్రాంతాలకు విసిరివేసింది! అతను బరువుగా నిట్టూర్చి, ఆలోచనలను మరోవైపుకు మళ్ళిం చాడు.

నెమ్మదిగా నడుస్తూ, చంద్రం మకాం దగ్గరకు చేరుకొన్నాడు. తునికిచెరువు గ్రామా నికి మైలున్నర దూరంలో భద్రాచలం ఏడుగు రాళ్ళపల్లి ఫారెస్టు రోడ్డు ప్రక్కన చంద్రం తన మకాం ఏర్పాటు చేసుకొన్నాడు!

చంద్రం రేడియో ట్యూన్‌చేసి "అమ్మా... టీ ఉన్నదా?" అని కేకపెట్టాడు. లోపలనుంచి "తెస్తున్నా బాబు" అని మునెమ్మ జవా బిచ్చింది.

చంద్రం పొలం, మునెమ్మ కుటుంబమే ఇన్నేళ్ళనుంచీ వ్యవసాయం చేస్తోంది. భర్త రామి రెడ్డి పోయినతరువాత మునెమ్మ కొడుకును పెట్టుకొని వ్యవసాయం చేయించింది. మూడేళ్ళ క్రిందట చంద్రం వచ్చాడు. వచ్చి ఆ కుటుం బంతో కలిసిపోయాడు. మునెమ్మ చంద్రాన్ని కొడుకులా చూచుకొంటుంది.

చంద్రం టీ త్రాగి బయటకి వచ్చాడు. ఆ ప్రశాంతమైన ప్రదేశంలో జీవితము ఏకాంత ముగానే ఉంటుంది. అలాంటి ఒంటరితనాన్ని కోరుకొనే చంద్రం అక్కడికి వచ్చాడు. కొందరు ఎలాంటి జీవితానికైనా అతుక్కుపోగలరు. చంద్రం అలాంటి వర్గానికి చెందినవాడు. అత నెప్పుడూ ఈ అడవి ప్రాంతానికి వచ్చినందుకు దిగులుపడలేదు.

రోజుకన్నా ముందుగా అచ్చిరెడ్డి పశువుల్ని తోలుకొని వచ్చి, దొడ్లో గట్టువేసి, చంద్రం దగ్గరకు వచ్చి — "క్రరిగిత్త తప్పిపోయిం దన్నా!" అన్నాడు.

చంద్రం "క్రరిగిత్త తప్పిపోయిందా?" అని "పద పోయి చూద్దాం" అన్నాడు.

వెంటనే ఇద్దరూ కలిసి బయలుదేరారు. వాళ్ళు చెరువుకట్టమీదకు వెళ్ళేటప్పటి కింకా బారెడు ప్రొద్దు ఉంది. చెరో వైపుకు విడిపోయారు.

చంద్రం చెరువుకట్టవిడిచి, క్రిందికి దిగి చెరువు పైభాగంలో నడుస్తూండగా ప్రొద్దు క్రుంకిపోయింది. చంద్రం "రాముా" అని ఎలుగెత్తి పిలుస్తూ నడుస్తున్నాడు. క్రరి గిత్తకు రెండేళ్ళ వయస్సు. చిన్నప్పటినుంచీ చంద్రం దానిని "రామూ" అని పిలిచేవాడు. "రామూ" అనగానే ఆ లేగ చెంగు చెంగున అతని దగ్గరికి ఉరికి వచ్చేది. కొన్నేపటికల్లా అడివంతా చీకటి కమ్ముకొన్నది. మరో పది నిమిషాల్లో అచ్చి రెడ్డి వచ్చి చంద్రాన్ని కలుసుకొన్నాడు.

"ఈ చీకటిలో అడివిలో తిరగడం మంచిది కాదు. పోదాం పద! తెల్లవారే వచ్చి వెదుకుదాం" అన్నాడు చంద్రం.

"సరే నన్నా!" అన్నాడు అచ్చిరెడ్డి.

మెలికలు తిరిగిన కాలి బాటలో నడిచి, వాళ్ళు చెరువుకట్ట ఎక్కుతూండగా, కొర కంచులు పట్టుకొని వస్తున్న బోడిదొర, శిరవన్న దొర ఎదురయ్యారు.

రాత్రి భాగంలో అడవిలో నడిచివెళ్ళేటప్పుడు కోయవాళ్ళు కొరకంచులు పట్టుకొని వెళతారు. నిప్పును చూచి క్రూర జంతువులు దూరంగా తొలగిపోతవనేదే దాని అంతర్యము.

"ప్రొద్దు పోయినదాకా అడివిలో ఉన్నారేం బాబూ...ఇంటి దగ్గర మునెమ్మ కంగారుపడు తూంది" అన్నాడు బోడిదొర.

"క్రరిగిత్తను వెదకడానికి వెళ్ళాం దొరా!" అన్నాడు చంద్రం.

"చెరువుపై పొలాన ఈ మధ్య మెకాలు జోరుగా తిరుగుతున్నాయి బాబు" అన్నాడు శిర వన్న దొర.

"అందుకనే భయపడుతున్నాను. తెల్లవార కుండా వచ్చి వెదుకుదాం" అన్నాడు.

"మంచిది బాబు" అన్నాడు శిరవన్న దొర.

తరువాత అందరూ మౌనంగా నడిచి మకాం సమీపించారు.

ఆ రాత్రి చంద్రానికి సరిగా నిద్రపట్టలేదు. అతని ఆలోచనలన్నీ క్రరిగిత్త మీదనే ఉన్నాయి., తెల్లవారుఝామునే శిరవన్నదొర వచ్చి పిలిచాడు. చంద్రం వెంటనే లేచి., తక్కిన పాలేళ్ళను వెంటబెట్టుకొని బయలుదేరాడు. తెలతెలవారు తూండగా వాళ్ళు చెరువుపై పొలానికి చేరు కొన్నారు. అక్కడ విడిపోయి తలో వైపుకు వెళ్ళారు.

చంద్రం పాతపోడులవైపు నడుస్తున్నాడు. కోయలు అడివి నరికి, నరికిన చెట్లను తగల బెట్టి, ఆ బూడిదమీద కొండ జొన్న, సామకంది మొదలైన పైరులు పండిస్తారు. దీనినే పోడు వ్యవసాయమంటారు. నిజానికి పోడు వ్యవ సాయము చేయడమే చాల శ్రమతో కూడిన పని. కానీ అనాదినుంచీ అడవుల్లో నివసిస్తూ ఉన్న కోయలకు...పశువుల అవసరము లేకుండా, స్వశ క్తితో చెట్లు నరికి పోడు వ్యవసాయము చేయడమే సులువుగా కనిపిస్తుంది. ఇలా అడివి నరికి, వ్యవసాయము చేయడమువల్ల అడివంతా పాడైపోకుండా ప్రభుత్వం ప్రతి గ్రామానికి కొంత భాగం అడివిని పోడు వ్యవసాయంకోసం ప్రత్యేకించింది. దానిని 'అన్‌రిజర్వుడ్ ఫారెస్టు' అంటారు. అలా ప్రత్యేకించిన భాగంలోనే కోయలు పోడు నరుకుతుంటారు.

చంద్రం నడుస్తున్న పోడు ఆ ఏడాదే నరి కేశారు. ఐదారెకరాలు ఉంటుంది. చిన్న చిన్న రువ్వులు. అక్కడక్కడా పెద్ద టేకు, మద్ది మానులు ఉన్నాయి. ప్రభుత్వపు ఆదేశం ప్రకారం కోయలు పోడు నరికేటప్పుడు ఫల వృక్షాలను, విలువైన టేకు, మద్దిమానులను నరకకుండా వదిలేస్తారు.

చంద్రం నాలుగడుగులు ముందుకు నడిచి, కొంత దూరంలో క్రరిగిత్త శవాన్ని చూశాడు. వెంటనే దగ్గరకు వెళ్ళి, శవానికున్న గాయాలను బట్టి పెద్దపులి దానిని చంపిందని గుర్తించాడు. అతని మనస్సు బాధతోను, కోపంతోను నిండి పోయింది. పెద్దపులిలా మిగిలిన మాంసాన్ని తినడానికి ఆ రోజు రాత్రికి తప్పకుండా వస్తుంది. ఆ శవం దగ్గర మాటు కట్టుకొని కూర్చుని పులిని చంపి కసితీర్చుకోవచ్చును.

చంద్రం అలా నిశ్చయించుకొని "కూ" అని ధ్వని చేశాడు. దానికి జవాబుగా నాలుగువైపుల నుంచి "కూ", "కూ" అని సమాధానాలు



అంతరాయం

చిత్రం — ఎమ్. సుబ్బారావు (నరసన్నపేట)



పట్టణానికి

ఫోటో—పి. గురుమూర్తి (మద్రాసు-18)

వచ్చాయి. అడివిలో ఒకరి నొకరు పిలుచుకోడానికి "కూ" అని ధ్వని చేస్తారు. ఎలుగెత్తి పిలవడంకన్నా "కూ" అని గట్టిగా ధ్వని చేయడం తేలిక. ఆ కూత చాలదూరంవరకు వినిపిస్తుంది.

కాస్సేపటిలో అందరు అక్కడికి వచ్చి చేరారు. చుట్టూ పులిజాడలు చూశారు.

"చాల బారీ మెకం బాబు" అన్నాడు శిరవన్న దొర.

చంద్రం తన ఉద్దేశ్యం అందరికీ చెప్పాడు.

శిరవన్నదొర క్రరిగిత్త శవానికి దగ్గరగాఉన్న మద్దిచెట్టుమీద మాటు కట్టడానికి నిర్ణయించాడు. వెంటనే పని ప్రారంభమైంది. ఇద్దరు మకాం దగ్గరకు వెళ్ళి సులికమంచం తాళ్ళు తెచ్చారు. మరో ఇద్దరు దూరంగా వెళ్ళి బడితెలు నరికి తెచ్చారు. మద్దిచెట్టు కొమ్మల్లో భూమికి పదిహేను అడుగుల ఎత్తున మాటు కట్టారు.

శవాన్ని రాబందులు తినివేయకుండా బోడి దొరను కాపలాఉంచి తక్కిన వాళ్ళు మకాముకు తిరిగి వెళ్ళారు.

సాయంత్రం నాలుగు గంట అయ్యేసరికి చంద్రం, శిరవన్నదొర మాటులో కూర్చున్నారు. చంద్రం చేతిలో జోడుగుళ్ళ తుపాకీ ఉన్నది. అతని గురికి తిరిలేదు. ఎన్. సి. సి. లో తుపాకీ గురికొట్టడంలో చంద్రం మొదటి స్థానం ఆక్రమించాడు. ఆ అనుభవంతో వేట అతనికి తొందరగా అలవడింది. చంద్రం శిరవన్నదొర దగ్గర వేట నేర్చుకొన్నాడు. దొర మంచి అనుభవమున్న వేటకాడు.

వాళ్ళు కూర్చున్న మద్దిచెట్టుకు ఇరవై అడుగుల దూరంలో క్రరిగిత్త శవం చలనం లేకుండా పడిఉన్నది. దానిమీద ఈగలు ముసురుతున్నాయి. గాలి రివ్వ వీచినప్పుడల్లా దుర్గంధం వస్తూంది.

క్రరిగిత్తను, ఎల్లావుకోడెను కలిపి కాడికట్టాలని చంద్రం కోరిక. కానీ అతని కోరిక నెరవేరలేదు. అంతా విధివిలాసము. మానవుని ప్రయత్నమంతా భగవంతుని దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి ఉంటుంది. చంద్రం ఒకసారి చుట్టూ పరికించాడు. వాళ్ళు కూర్చున్న చెట్టుకు తూర్పువైపు అడివి చాల దగ్గరగా ఉన్నది. అకస్మాత్తుగా చెట్ల మధ్యనుంచి పెద్దపులిబయటికి వచ్చింది. ఇద్దరూ ఊపిరి శబ్దంకూడ అదుపులో పెట్టుకొని కూర్చున్నారు. పులి చెట్లలోనుంచి ఖాళీ ప్రదేశంలోనికి రాగానే ఆగి, నలువైపులా పరికించి నెమ్మదిగా ముందుకు వస్తూంది. చాల పెద్దపులి. చంద్రం కూర్చున్న చెట్టుకు వంద గజాల దూరంలోకి వచ్చి, ఆకస్మికంగా ఆగిపోయింది. చంద్రం ఒక్కసారిగా నిరుత్సాహపడ్డాడు. పులి తమనుగాని చూచిందా? అలా చూడ్డంగాని సంభవిస్తే, అక్కడినుంచే వెనక్కి వెళ్ళిపోతుంది. అతను ఆత్రుతతో పులిని గమనిస్తున్నాడు. చంద్రం స్థితి వేటగానికే గాని ఇతరులకు అర్థం కాదు.

ఐతే చంద్రం భావించినట్లుగా పులి వెనక్కి వెళ్ళిపోలేదు. అక్కడే నిలబడి దానికి కాస్త దూరంలోఉన్న పొదవైపు చూడ్డం మొదలు పెట్టింది. అంతలో ఆ పొదలోనుంచి ఒక దుప్పిపిల్ల బయటికి వచ్చింది. ఆ పిల్ల ఆ రోజునే పుట్టిందో ఏమో, తూలుకుంటూ, తూలుకుంటూ ముద్దు ముద్దుగా నడుస్తూంది. పులి ఆ దుప్పిపిల్లకేసే చూస్తూంది. ఆ దృశ్యం చూస్తూంటే చంద్రం మనస్సు గిలగిల లాడిపోయింది. ఆ అమాయకపు దుప్పిపిల్ల క్రూర జంతువు పొట్లోకి వెళుతూంది. చంద్రం నిస్సహాయమైన స్థితిలో ఉన్నాడు. అంతదూరం అతని తుపాకీ తగలదు. గాలిలోనికి తుపాకీ ప్రేల్చి, పులిని బెదరగొడితే, దానిని చంపే అవకాశం పోతుంది. కానీ ఒక పసికూన నిండు ప్రాణం క్షణాలమీద ఉన్నది. చాల ఇరుకైన సమస్య. అతను ఒక నిశ్చయానికి రాలేకపోతున్నాడు.

దుప్పిపిల్ల పులిని చూసింది. పులిని తల్లిగా భావించిందో ఏమో నెమ్మదిగా దానిని సమీపిస్తూంది. అప్పుడు జరిగిన విచిత్రం చంద్రం మరిచిపోలేడు.

పెద్దపులి తలవంచి ఆ దుప్పిపిల్లను ఆప్యాయంగా చూచి, నిశ్శబ్దంగా ప్రక్కకు అంగవేసి క్షణాల్లో అడివిలోనికి వెళ్ళిపోయింది. దుప్పిపిల్ల

(తరువాయి 41 వ పేజీలో)

# ఔదార్యము

(23 వ పేజీ తరువాయి)

పులి వెళ్ళినవైపు అమాయకంగా చూస్తూ ఉండిపోయింది.

పెద్దపులి ఔదార్యం గల క్రూరజంతువని అత నెప్పుడూ భావించలేదు. నోట్లోకి వచ్చిన దుప్పిపిల్ల అమాయకత్వాన్ని గుర్తించి దూరంగా తొలగిపోయిన పెద్దపులి ఔదార్యం ముందు మానవు లెంతో వెనకబడి ఉన్నారని పించింది. ఆ ఆలోచన రాగానే అతని కళ్ళు నీళ్ళతో నిండి హృదయం తేలికపడింది.

ఒకటి రెండు నిమిషాల తరువాత అడివిలో నుంచి దుప్పి అరుపు వినిపించింది. దుప్పిపిల్ల చెవులు నిక్కించి ఆ పిలుపు విని తప్పటడుగులు వేసుకొంటూ ఆ వైపుకు వెళ్ళిపోయింది.

చంద్రం ఆ సంఘటన గురించే ఆలోచిస్తు న్నాడు. కర్రిగిత్త శవం బిర్రబిగుసుకు పోయింది. పొట్ట బాగా ఉబ్బింది. ఈగలు మునురుతున్నాయి. మళ్ళీ అతని మనస్సు కర్రి గిత్తమీద జాలితోను, పెద్దపులిమీద కోపం తోను నిండిపోయింది.

నెమ్మదిగా ప్రొద్దు వాలిపోయింది. వెంటనే వాతావరణంలో మార్పు వచ్చింది. ఒక్కసారిగా చల్లబడింది.

పెద్దపులి మళ్ళీ తిరిగి రావడానికి అవకాశాలు లేకపోలేదు. పులి శవం దగ్గరకు రాలేదు. దాని కేమీ అనుమానం కలుగలేదు. దానంత టదే వెళ్ళిపోయింది. అందువల్ల పులి మళ్ళీ వస్తుంది. చంద్రం నిశ్శబ్దంగా మాటులో కూర్చుండి పోయాడు.

మాటులో ఉన్నప్పుడు మనస్సెంతో ప్రశాం తంగా ఉంటుంది. ఆలోచనలన్నీ కనిపెట్టుకొని ఉన్న జంతువు ఆగమనంమీదనే కేంద్రీకరించ బడి ఉంటాయి.

కానీ చంద్రం మనస్సు ప్రశాంతంగా లేదు. ఎన్నెన్నో ఆలోచనలతో నిండిపోయింది. ఎగ్రి కల్చరల్ బి. యస్ సీ. పూర్తిచేసిన వెంటనే చంద్రానికి వ్యవసాయశాఖలో ఉద్యోగమయింది. చంద్రం మొదటి నెలజీతం అందుకొని ఒక రోజు సెలవు తీసికొని ఇంటికి బయలుదేరాడు.

తల్లితండ్రులు చిన్నప్పుడే పోవడంవల్ల చంద్రం మేనమామ రాయుడిగారి ఇంట్లోనే పెరిగాడు. మేనమామకు ఉమ ఒక్కతే కూతురు. ఉమ కూడ తల్లిలేని బిడ్డ. రాయుడుగారు కూతుర్ని,మేనల్లుణ్ణి ఒకేలాచూచేవాడు. ఇద్దరూ ఒకే స్కూల్లో చదివారు గానీ, చంద్రానికీ, ఉమకూ మధ్య చాల వ్యత్యాసం ఉంది. ఉమ ఎం. బి. బి. యస్. ప్యాసైన వెంటనే జిల్లా హెల్తు ఆఫీసరు ఉద్యోగమయింది. ఆ తరువాత సంవత్స రానికి చంద్రం బి. ఎస్ సీ. పూర్తి అయింది.

చంద్రం తన మొట్టమొదటి సంపాదనను మేనమామ చేతిలోపెట్టి ఆయనకు నమస్క రించాడు. రాయుడుగారు సంతోషంతో చంద్రాన్ని ఆశీర్వదించాడు.

"మామయ్యా! తల్లితండ్రులు లేని నన్ను చిన్ననాటినుంచీ పెంచి పెద్దవాడిని చేశారు. మీ ఋణం నే నెప్పటికీ తీర్చుకోలేను...." అన్నాడు.

"ఇందులో నాదేమున్నదోయ్. అంతా భగ వంతుని దయ....." అని ఆయన చంద్రం ముఖంలోనికి చూచి, "నీవేదో చెప్పాలనుకొంటు న్నావు. సంశయిస్తా వెందుకు?చెప్పు" అన్నారు.

"మామయ్యా నా వెనకపెద్దవాళ్ళెవరూ లేరు. అన్నింటికీమీరే" అని కాస్త ఆగి, "నాఉద్దేశ్యం నేనే బైటపెట్టవలసి వస్తున్నందుకు మన్నిం చండి. ఉమను...." అని నీళ్ళు మ్రింగాడు.

"చంద్రం, నాకేమీ అభ్యంతరం లేదు. ఉమ రేపు వస్తుంది. ఆ సంగతి ఆమెనే అడుగు" అన్నా రాయన.

మర్నాడు ఉమ వచ్చినప్పుడు ఆమెను పెళ్ళి విషయ మెలా అడగాలో ఊహించుకొంటూ చంద్రంతీయని కలలతో రాత్రి గడిపాడు.

మరునాడు ఉమ వచ్చింది. ఆమెవెంట ఎంతో ఆనందం కూడా తెచ్చింది.

రాత్రి ఉమ, చంద్రం డాబామీద కూర్చు న్నారు. చల్లని పైరుగాలి వీస్తూంది. వెన్నెలవెనక చందమామ కొబ్బరిచెట్లలోంచి అందంగా దాగుడుమూత లాడుతున్నాడు. ఉమకు అక్కడ కూర్చుని చందమామను చూడడమంటే ఎంతో ముచ్చట.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ చంద్రం "ఉమా, నీతో ఒక విషయం మాట్లాడాలి" అన్నాడు.

"మాట్లాడు బావా......" అన్నది ఉమ.

చంద్రం గొంతు సవరించుకొని..."ఉమా నన్ను పెళ్ళిచేసుకోవడం...నీ కిష్టమేనా?" అన్నాడు.

"సారీ బావా!" అని చటుక్కున కుర్చీలో నుంచి లేచి "నీకు నాకు మధ్య ఉన్న వ్యత్యాసం గురించి ఏమాత్రం ఆలోచించివున్నా నీ వీ ప్రశ్న అడిగివుండేవాడివి కావు......" అని ఉమ చక చక వెళ్ళిపోయింది.

చంద్రం వెన్నెల్లో చిన్నబోయాడు.

నెమ్మదిగా తేరుకొని ఆలోచించాడు. ఉమకు తనకు మధ్య చాల వ్యత్యాసమున్నది. విద్యలోను హోదాలోను, ఆస్తిలోను అన్నింటిలోను తనెంతో వెనకబడి ఉన్నాడు. ఉమ నిరాకరించ డంలో ఆమె తప్పేమీలేదు. తన దుర దృష్టానికి ఆమెను నిందించటం శుద్ధ పొర బాటు.

అతని మనస్సు విప్లవాత్మక మైన ఈ ఆలోచనలను అంగీకరించలేక దుఃఖాన్ని వదిలిపెట్టలేకపోయింది.

మరునాడురాయుడుగారు పదివేలరూపాయలు

సినిమా పాటలు
...గారిచే, నెలకు మంచిపరుమానం పొందవలెనన్నచో నేడే మాకు వ్రాయండి ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషు లేక హిందీలో వ్రాయవలెను.
BOMBAY FILM SERVICE
(W.A.P.) Phagwara (N.R.)

సాడెంజా




మూల వ్యాధులకు.
ప్రతి చోట దొరుకును

తాంబూలములకు
...యిప్పుడు అక్కరలేదు.
రుచి
సుగంధ ద్రవ్య సముదాయము.
పచ్చకర్పూరం, కుంకుమ పువ్వు చేర్చబడినది.
అన్ని కిరాణా కొట్లలో దొరుకును.
కిల్లీకొట్లలో వాడబడుచున్నది.
రూ. 3—25, పోస్టేజి అదనం.
..., విజయవాడ—2.

స్థాపితం 1920
రిజిష్టర్డు
గోపాలపురం
తూ. గో. జిల్లా
వగైరా చర్మ
... వ్యాధులకు
ప్రత్యేక చికిత్స.
బ్రాంచి: ... ఆర్. ఎస్.
సికింద్రాబాదు—3560 కింగ్స్‌వే

చంద్రానికిచ్చి, "మీ అమ్మ అవసాన కాలంలో నా కిచ్చిన మొత్తంలో, నీ చదువుకు ఖర్చు పెట్టగా మిగిలిన సొమ్మిది. భద్రాచలానికి పది మైళ్ల దూరంలో తునికిచెరువు అనే కోయ గ్రామంలో మీ నాన్నగారు ఆ ప్రాంతాలలో పనిచేసినప్పుడు పట్టామీద సంపాదించిన వంద ఎకరాలభూమి నీ కున్న ఆస్తి. నేనెప్పుడూ అక్కడికి వెళ్లలేదు. ఆ భూమి మీద ఏటా వంద రూపాయలు ఆదాయం వస్తూంది. నీ వెప్పుడైనా, ఆభూమిని గురించి వివరాలు తెలుసుకోవాలంటే, భద్రాచలం కరణం గారిని కలుసుకో. నేను రేపు ఉమతో బందరు వెళ్లుతున్నాను. జాగ్రత్తగా ఉద్యోగంచేసుకొని అభివృద్ధిలోకి రా..." అన్నారు ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి!

పదివేలు చేతికి రాగానే చంద్రానికో ఆలోచన తట్టింది. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, భద్రాచలం బయలుదేరాడు.

కరణం గారి ద్వారా తునికిచెరువు వెళ్లి భూమి ఒప్పగించుకొని, వ్యవసాయము మొదలు పెట్టాడు. అదంతా, ఉమను మరిచిపోవడానికి అతను ఎన్నుకొన్న మార్గం!

అడివంతా ప్రతిధ్వనించేలా నెమలి కూసింది! చంద్రం ఉలిక్కిపడ్డాడు. అడివిలో నివసించే పక్షులు, జంతువులు పెద్దపులిని చూచినప్పుడు దాని ఉనికిని తెలియజేస్తూ తక్కిన జంతువులకు, పక్షులకు హెచ్చరిక చేస్తాయి. అడవుల్లో

# ఔదార్యము

తిరిగేవాళ్ళు ఆ హెచ్చరికను సులభంగా పోల్చుకోగలరు.

అకస్మాత్తుగా రెండు పులిపిల్లలు బయలు మీదకు వచ్చాయి. అవి చాల చిన్నవి. వెనకాలే వాటి తల్లివచ్చింది. ఆడపులిఎంతో జాగ్రత్తగా, నలుదిక్కులా పరిశీలిస్తూ నెమ్మది నెమ్మదిగా చంద్రం కూర్చున్న చెట్టుదగ్గరకు వచ్చింది. పిల్లలు రెండూ తల్లివెంటనే వచ్చాయి.

పులి, క్రిగిత్త శవాన్ని నోటితోపట్టి తిరగవేసి, పెద్ద మాంసం కండను కొరికి పిల్లలకు అందించింది. పాలపళ్ళతో పులిపిల్లలు మాంసం కండను కొరికి తినడానికి ప్రయత్నిస్తూ ఉంటే తల్లి ముచ్చటగా చూస్తూంది.

ఆ దృశ్యాన్ని చంద్రం నిశ్శబ్దంగా చూస్తూ ఉండిపోయాడు.

...చూస్తూండగానే చీకటి పడిపోతున్నది. ఎంతకూ పులిని కొట్టకపోవడం గమనించి, శిరవన్నదొర చంద్రాన్ని గోకి హెచ్చరించాడు.

"లేదు దొరా! ఇప్పుడు మనం పులిని చంపితే, ఈ పిల్లలు తల్లిలేనివైపోతాయి. తల్లి లేకుండా స్వతంత్రంగా జీవించే ఈడు లే దీ పిల్లలకు" అన్నాడు.

మాటుమీద మాట్లాడకూడదు. కానీ చంద్ర మిప్పుడు వేటాడ్డం లేదు.

అతని మాటలు విని, పెద్దపులి ఒక్కసారి గుర్రుపెట్టి పిల్లల్ని తీసుకొని అడివిలోనికి వెళ్ళిపోయింది.

కాస్సేపటి తరువాత చంద్రం "దొరా, ఇక వెళదామా?" అన్నాడు.

"లేదు బాబు! పిల్లల పులిని నమ్మలేము. కాస్త ఆగి వెళదాం" అన్నాడు.

"సరే" అన్నాడు చంద్రం.

అడివంతా చీకటి దట్టంగా వ్యాపించింది.

రెండు గంటల తరువాత చెట్టుదిగి, ఇద్దరూ బయలుదేరారు.

చంద్రం తుపాకీ భుజానికి తగిలించుకొని ముందు నడుస్తున్నాడు. మధ్య మధ్య టార్చిలైటు వెలిగిస్తూ దారి చూస్తున్నాడు. శిరవన్న దొర మౌనంగా అతని వెనక నడిచివస్తున్నాడు.

మానవుని ఆవేశాలను, ఆలోచనలను సంఘటనలు విచిత్రంగామార్చివేయగలవు. భూమిమీద నివసిస్తున్న జీవరాసు లన్నింటికీ ఒక దానితో ఒకదానికి సన్నిహితమైన సంబంధ మున్నది. ఆ సంబంధమే మనస్సుకు రుజు మార్గాన్ని చూపిస్తుంది.

చీకటితో నిండిఉన్న అడివి మార్గంలో నడుస్తున్న చంద్రం మనస్సులోని ఆలోచన లివి.

చెరువుకట్ట దిగుతూండగా అతని టార్చి వెలుగులో రెండు కుందేళ్ళు పడి బెదిరి చెరో వైపుకు పరిగెత్తాయి. ఆ అమాయకపు కుందేళ్ళను చూచి చంద్రం. నవ్వుకొన్నాడు.

ఇద్దరూ రోడ్డుకు దగ్గర పడ్డారు. అకస్మాత్తుగా ఒక స్త్రీ ఆర్తనాదం వినిపించింది. చంద్రం వళ్ళు ఝల్లుమన్నది. అడివిలో ఆవేళటప్పుడు స్త్రీ ఆర్తనాదం చాల వింతఅయిన విషయం. అందులో మన్యం ప్రాంతాలలో చాల రకాల కట్టు కథలు వాడుకలో ఉంటాయి. వనదేవతలు, దయ్యాల నమ్మకాలు కోయవాళ్ళలో ఎక్కువ. చంద్రం వెనక్కు తిరిగి శిరవన్నదొరకేసి చూచాడు.

అతను మామూలుగానే నడిచివస్తున్నాడు.

మళ్ళీ ఆర్తనాదం వినిపించింది.

"బంగాళాలోంచి ఎవరో కేకలు వేస్తున్నారు. బాబు! పదండి" అన్నాడు శిరవన్నదొర.

మళ్ళీ వినిపించింది. ఈసారి చంద్రం బంగాళావైపు పరుగెత్తాడు.

బంగాళాముందు జీపు ఆగిఉన్నది. లోపల నుంచి "రక్షించండి" అని స్త్రీ ఏడుస్తూ అరుస్తూంది.

చంద్రం తలుపుల్ని ఒక్క తన్ను తన్నాడు. అవి వెంటనే తెరుచుకొన్నాయి. టార్చి వెలుగులో ఒక స్త్రీని, ఒక పురుషుడు బలవంతం చేస్తున్నాడు. రెండోవాడు, అతనికి సాయం చేస్తున్నాడు.

చంద్రం కోపంతో వణికిపోయాడు. "స్కౌం


## డాక్టరు కండి

ఇంటో కూర్చుని, పోస్టల్ ట్యూషన్ ద్వారా. గవర్నమెంటు రిజిస్టరు కాలేజినుంచి మీరు ఒక డిప్లమో పొంద వచ్చును. ఫ్రీ ప్రాస్పెక్టస్‌కు వ్రాయండి.

**Indian Homoeopathic College (A.W.P.) Jullundur City**

## క్యాలెండర్లు

నాణ్యమైన ఫొటో ఆఫ్‌సెట్ క్యాలెండర్లకు మమ్ము సంప్రదించండి. క్యాలెండరు బొమ్మలను క్యాలెండరు మ్యానుఫ్యాక్చర్లకు, ప్రింటర్లకు ప్రత్యేక ధరలకు సప్లయి చేయుదుము. మంచి కమీషన్‌పై పనిచేయుటకు సమర్థులైన ఏజంట్లు కావలెను. వ్రాయండి :

**Ajanta Art Calendar Mfg. Co., P.B. 255, Madras-1.**

SWASTIK.



డల్సు'' అన్నారు.

ఆ ఇద్దరూ నిశ్చేష్టులయ్యారు.

ఆ స్త్రీ ముడుచుకుపోయింది.

చంద్రం వాళ్ళను కొట్టబోతూ ఆ స్త్రీని గుర్తుపట్టి ''ఉమా!'' అన్నాడు.

ఆమె అతని కంఠం గుర్తించి ''బావా'' బావురుమంటూ అతన్ని చుట్టేసింది.

ఆ అదునులో ఆ ఇద్దరూ తేరుకొని ఒక్క ఉడాయింపులో జీపులో పడ్డారు. మరో నిమిషంలో జీపు భద్రాచలం వైపుకు పారిపోయింది.

చంద్రం బయటికి పరిగెత్తాడు గాని, జీపును అందుకోలేకపోయాడు.

అతను కోపంతో ''పిరికిపందలు....'' అని గొణుక్కొంటూ ఉమదగ్గరకు వెళ్ళి ''పద, ఇంటికి వెళదాం'' అన్నాడు.

ఇద్దరూ బయలుదేరారు ...దొర వాళ్ళ వెనక వస్తున్నాడు.

అప్పుడే ఉదయించిన చందమామ వెలుగు... అడివంతా వ్యాపించింది.

''ఉమా, అసలు నీవు ఒంటరిగా వాళ్ళతో ఇక్కడి కెందుకు వచ్చావు?''

''వాళ్ళలో ఒకతను నాతో చదివాడు. నేను ఉద్యోగంలో చేరినతరువాత ఒక ఫ్యాక్టరీ తనిఖీ చేయడానికి వెళ్ళినప్పుడు అతన్ని కలుసుకోవడం సంభవించింది. ఎంతో మర్యాద చేశాడు. తరువాత అప్పుడప్పుడు కలుసుకొంటూ ఉండేవాళ్ళం. స్నేహంతోను, సభ్యతతోను ప్రవర్తించేవాడు. కొన్నాళ్ళ తరువాత రెండో అతని పరిచయ మయింది.

ముగ్గురం కలిసి భద్రాచలం దేవుణ్ణి చూడాలని ప్లాను చేసికొని, వాళ్ల జీపులోనే బయలుదేరి వచ్చాము. రెండు రోజులు కులాసాగానే గడిచి పోయాయి. ఇవాళ ఫారెస్టు చూడ్డానికని మాధవరావుపేట వెళ్లాము. తిరిగి వస్తుండగా చీకటిపడింది. దారిలో ఈ బంగాళాలో ఆపి...'' ఆమె కంఠం దుఃఖంతో నిండిపోయింది.

చంద్రం మౌనంగా నడుస్తున్నాడు !

''బావా, నీవు సమయానికి భగవంతుడిలా వచ్చి కాపాడకపోతే నా గతేమయ్యేది ?'' అన్నది.

''సీతామ్మవారు, వనవాసంచేసిన ఈ దండకారణ్యంలో ఏ స్త్రీకీ అవమానం జరగదు'' అన్నాడు.

''బావా, ఇక్కడికి వచ్చి రామాయణం వల్లిస్తున్నావా ?'' అన్నది.

''ఆ ఘనత నీదే ఉమా !'' అన్నాడు.

ఉమ సిగ్గుపడింది.

తరువాత మౌనంగా చాలాసేపు నడిచి మకాం దగ్గరకు చేరుకొన్నారు.

చంద్రం ''అమ్మా'' అని పిలువగానే మునెమ్మ లోపలినుంచి బైటకివస్తూ, ''అప్పుడే వచ్చేశావే'' అంటూ చంద్రంతో ఉన్న యువతిని చూచి ఆశ్చర్యంతో గుమ్మంలోనే ఆగిపోయింది.

''అమ్మా, ఈమె ఉమ. . .మన అదృష్టం కొలదీ. .అడివిలో దొరికింది'' అన్నాడు. మునెమ్మ ముఖంలో ఆనందం విద్యుత్తులా వెలిగింది.

''నీదంతా సోద్యం బాబు !'' అని ''రా తల్లీ'' అని వచ్చి ఉమ చేయి పట్టుకొన్నది.

''చాల అలసిపోయావు తల్లీ స్నానం చేద్దు గాని రా...''అని ఉమను లోపలికి తీసుకొనివెళ్లిపోయింది !

అంతలో లచ్చిరెడ్డి వచ్చి ''అన్నా, పులిని కొట్టలేదా ?'' అన్నాడు.

*చంద్రం అతనికి... జరిగినదంతా వివరంగా* చెప్పాడు.

స్నానంచేసి తాజాగా ఉమ బయటికి వచ్చింది. ఆమె కట్టుకొన్న చీరను చూచి, చంద్రం ఆశ్చర్యంతో ''అమ్మా, ఈ చీర ఎక్కడిది?'' అన్నాడు.

''దేవుడి పెళ్లికి భద్రాచలం వెళ్లినప్పుడు కొన్నాను బాబు. ఉమ కిలాంటి చీరంటే... ఇష్టమని చెప్పావు. మరిచిపోయావా?'' అని లోపలికి వెళ్ళిపోయింది.

''అత్తయ్యకు. .నా సంగతులన్నీ చెప్పావన్న మాట'' అన్నది ఉమ.

''అప్పుడే అమ్మను మంచి చేసుకొన్నావన్న మాట. . .''అన్నాడు చంద్రం నవ్వుతూ.

ఉమ పెదవుల మధ్య చిరునవ్వు వెలిగి క్షణంలో మాయమయింది.

''అన్నం వడ్డించాను లేవండి'' అని మునెమ్మ వచ్చి పిలిచింది.

మూడు సంవత్సరాల తరువాత మళ్లీ ఉమా, చంద్రం కలిసి భోజనం చేశారు. అలా అవుతుందని చంద్రం కలలోకూడా అనుకోలేదు. ఒకనాడు చంద్రం మునెమ్మతో ఉమను గురించి చెప్పినప్పుడు ''ఉమ నిన్ను వెదుక్కొంటూ మనింటికి వస్తుంది, నీవు దిగులు పడకు బాబు'' అన్నది.

ఆమె అమాయకత్వానికి ఆనాడు అతను నవ్వుకొన్నాడు. కానీ నేడామె మాటలు అక్షరాల నిజమయ్యాయి.

లోపల గదిలో ఉమ పడుకొన్నది. ఆమెకు కాస్త దూరంలో మునెమ్మ పడుకొన్నది.

ఎంత ప్రయత్నం చేసినా ఉమకు నిద్ర రావడంలేదు. ఎన్నో ఊహలతో ఆమె మనస్సంతా క్రిక్కిరిసిపోయింది.

''అప్పుడే ఇరవై ఐదేళ్ల జీవితం గడిచిపోయింది. తన ఈడువాళ్ళు పెళ్లిళ్లు చేసుకొని, పిల్లల్ని కని, భర్తలతో హాయిగా కాపురాలు చేస్తున్నారు. తను... ఏకాకి ! ఉద్యోగం, చేతినిండా డబ్బు, హోదా ఉన్నాయి. కానీ. . . ఆనందం, సౌఖ్యం సున్నా ! మూడేళ్లనాడు బావను తూలనాడడ మెంత పొరబాటయ్యిందో తానీనాటికి గుర్తించగలిగింది.



ప్రణయ తాండవం

ఫోటో — ఓ. త్రినాథ్ (కటక్-1)

బావ చాల మంచివాడు. ఆనాడు ఒక్క మాట కూడ మాట్లాడకుండా, ఈ అరణ్యవాసానికి వచ్చేశాడు ! నిజంగా తను అజ్ఞాతంగా ఇన్నాళ్లూ బావను ప్రేమిస్తూనే ఉంది. అసలు తను నిరాకరించినప్పుడు, బావ తన వెంబడి వాయించిఉంటే మూడేళ్ల జీవితం వృథా అయిఉండేదికాదు !''

ఆమె ఆలోచనలు కట్టిబెట్టి లేచి బయటికి వెళ్ళింది.

చంద్రం మంచంమీద కదులుతున్నాడు. బావకూడా. . .నిద్రపట్టక మథనపడుతున్నాడనే భావం ఉమ మనస్సులో చక్కిలిగింత అయ్యింది.

''బావా !'' అన్నది.

చంద్రం ఉలిక్కిపడి లేచి, కలకాదు, తను చూస్తున్నది నిజమేనని గుర్తించి ''ఏం ఉమా!'' అన్నాడు.

''బావా, అజ్ఞానంతో ఆ రోజు నిన్ను నిరాకరించాను. నన్ను క్షమించగలవా ?...'' అన్నది. ఆమె గుండె వేగంగా కొట్టుకొన్నది.

''ఉమా ! అజ్ఞానం మనస్సును ... వేసి శుద్ధి చేస్తుంది...''

''నన్ను శిక్షించు బావా . .'' అన్న దామె చిన్నగా ఏడుస్తూ.

చంద్రం ఆమెను చుట్టేసి ''ఇదే శిక్ష ఉమా !'' అన్నాడు.

ఉమ వెనక లేచివచ్చి గుమ్మంలో ... మునెమ్మ ఆనందంతో కళ్లు తుడుచుకొన్నది.

★